**మంచిమాట**

మీ వెనక మీ గురించి చెడుగా మాట్లాడేవారిని గురించి ఆలోచించవద్దు. ఎందుకంటే వారి స్థానమెప్పుడూ మీ వెనకే ఉంటుంది.

# DD9 వార్త

తెలుగు దినపత్రిక








www.dd9vaartha.com | సంపుటి : 01 సంచిక : 148 | బుధవారం, 14, 2026, | పేజీలు - 06 | వెల : 3/-


# కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే అవకాశం లేదు

- బిఆర్ఎస్‌కు గతమే తప్ప భవిష్యతు లేదు...రాదు
- కెసిఆర్ కుటుంబ అవినీతిపై కవిత వ్యాఖ్యలే నిదర్శనం
- మీడియాతో పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



**హైదరాబాద్,జనవరి 13 :** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నా రంటూ కొద్దిరోజులుగా వస్తున్న వార్తలపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తోసిపుచ్చుతూ.. అలాంటిదేమీ లేదని అన్నారు. మంగళవారం నాడు మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే అవకాశమే లేదని స్పష్టం చేశారు. తెలంగాణాలో బీఆర్ఎస్ పార్టీకి గతం తప్ప.. భవిష్యత్తు లేదంటూ వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుటుంబ అవినీతి గురించి కవిత నిజాలు చెప్తున్నారన్నారు. తాము చేసిన ఆరోపణలపై కవిత సమాధానం రూపంలో రుజువైందని చెప్పారు. కవిత మాటలతో కేసీఆర్ అవినీతి నిజమని ప్రజలు అర్థం చేసుకుంటున్నారని ఆయన చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణా ప్రయోజనాలే ముఖ్యమని.. ఒక్క నీటిబొట్టును కూడా వదలమని తేల్చిచెప్పారు. అజారుద్దీన్, మిగతా2లో...



## ప్రారంభానికి సిద్ధంగా ప్రధాని కార్యాలయం

**సర్వాంగ సుందరంగా రూపు దిద్దుకున్న కొత్త ఆఫీస్**

**సేవాతీర్థ్‌లోకి త్వరలోనే మారనున్న మోడీ**

**న్యూఢిల్లీ, 13 :** ఢిల్లీలో ప్రతిష్టాత్మక సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ప్రధానమంత్రి కొత్త కార్యాలయం ప్రారంభానికి సిద్ధమైంది. రైసినా హిల్ సమీపంలో అత్యాధునిక సౌకర్యాలతో రూపుదిద్దుకున్న ఈ భవన సముదాయంలోకి ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెలలోనే మారే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు మిగతా2లో...



## గాంధీపేరుతో కాంగ్రెస్ నీచ రాజకీయం

**పథకాలతో సహా అన్నిటికి ఇంది, రాజీవ్ పేర్లేనా**


**వాల్మీకి-అంబేడ్కర్ పేరున్న పథకం పేరు ఎందుకు మార్చారు**

**కాంగ్రెస్ రాజకీయాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి**

**కరీంనగర్ మున్సిపాలిటీలో బిజెపి జెండా ఎగరేస్తాం**

**కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు**

**కరీంనగర్,జనవరి 13 :** ఉపాధి హామీ పథకం పేరు మార్చడంపై కాంగ్రెస్ చేస్తున్న రాజకీయాన్ని నీచ రాజకీయంగా కేంద్రమంత్రి బండి సంజయ్ అభివర్ణించారు. వాల్మీకీ-అంబేద్కర్ ఆవాస్ యోజన (వాంబే) పేరుతో వాజ్‌పేయి తీసుకొచ్చిన ఇండ్ల పథకాన్ని కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎందుకు తీసేశారని ప్రశ్నించారు. వాల్మీకీ, అంబేద్కర్ పేర్లు తొలగించి ఇందిరా ఆవాస్ యోజనగా ఎందుకు మార్చారని, ఇది ఆ మహానుభావులను అవమానించడం కాదా అని విమర్శించారు. మిగతా2లో...




## ఇరాన్ ఆందోళనల్లో భారీగా మరణాలు

**వేలల్లో ఉంటుందన్న వార్తలతో ఆందోళన**

**న్యూఢిల్లీ,జనవరి 13 :** ఇరాన్‌లో అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొనసాగుతున్న ఆందోళనల్లో భారీ సంఖ్యలో మరణాలు చోటుచేసుకున్నట్లు ఆందోళన కలుగు తోంది. ఇప్పటివరకు ఆరు వందల మందికి పైగా చనిపో యినట్లు అధికారిక సమాచారం రాగా.. మిగతా2లో...

## వీధి కుక్కల బాధ్యత రాష్ట్రాలదే

- ఒక్క కరిచినా అందుకు బాధ్యత వహించాల్సిందే
- అందుకు విధించే జరిమానాలకు సిద్దంగా ఉండండి
- వీధి కుక్కలకు ఆహారం పెట్టేవారు కూడా దోషులే
- ఘాటు హెచ్చరిక చేసిన సుప్రీం కోర్టు



**న్యూఢిల్లీ,జనవరి 13 :** వీధి కుక్కల అంశంపై సుప్రీంకోర్టు మరో సారి కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ వ్యవ హారంపై మంగళవారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం.. కుక్కల బెడదను అరికట్టేందుకు చర్యలు తీసుకోకపోతే ఆయా రాష్ట్రాలపై భారీ జరిమానాలు వేస్తామని హెచ్చరించింది. ప్రతి కుక్క కాటు కు పరిహారం చెల్లించాల్సిందేనని స్పష్టం చేసింది. వీధి కుక్కల బెడదను నివారించేం దుకు రాష్ట్రాలు తగిన చర్యలు చేపట్టాలి. లేదంటే ప్రతి కుక్క కాటుకు, కుక్కల దాడిలో జరిగిన ప్రతి మరణానికి గానూ మిగతా2లో...

## కుంభమేళాకు మించి సమ్మక్క-సారలమ్మ జాతర

● రూ.250 కోట్లకుపైగా నిధులతో పనులు ● సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పర్యవేక్షణ ● మేడారం జాతర ఏర్పట్లపై మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీతక్క



**హైదరాబాద్,జనవరి 13 :** 28వ తేదీ నుండి 31 వ తేదీ వరకు జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు ఈసారి గతంకన్నా రెట్టింపు సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ప్రభుత్వంలోని వివిధ శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర మంత్రులు అడ్లూరి లక్షణ్ కుమార్, దనసరి అనసూయలు అన్నారు. మేడారం జాతరపై డా. బీ.ఆర్ అంబేద్కర్ సచి వాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో మిగతా2లో...


2లో

## మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల తుది జాబితా ప్రకటన

**మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో 52,43,023 మంది ఓటర్లు**

**26,80,014 మంది మహిళా ఓటర్లతో వారిదే అగ్రస్థానం**

**నిజామాబాద్ కార్పొరేషన్‌లో అత్యధికంగా 3,48,051 మంది ఓటర్లు**

## రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

**70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ**

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి**



**హైదరాబాద్,జనవరి 13 :** ధాన్యం కొనుగోలులో తెలంగాణ రికార్డు సృష్టించిందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ముందెన్నడూ లేని రీతిలో 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రికార్డు నెలకొల్పిందని అన్నారు. 2025-26 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ముందెన్నడూ లేని రీతిలో 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందని అన్నారు. గతంలో కొనుగోలు చేసిన 70.2 లక్షల మెట్రిక్ టన్నుల రికార్డును ఈ ఖరీఫ్ సీజన్‌లో అధిగమించిందని చెప్పారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో చారిత్రక మైలురాయి అని అభివర్ణించారు. పౌరసరఫరాల శాఖ, నీటిపారుదల శాఖలు సమన్వయం చేసుకోవడంతోపాటు రాష్ట్ర రైతుల భాగస్వామ్యంతోనే ఈ రికార్డు సాధ్యమైందని స్పష్టం చేశారు. మిగతా2లో...

## ఉగ్రవాదానికి తెగిస్తే గట్టిగా బుద్ధి చెబుతాం

- ● ఆపరేషన్ సిందూర్‌లో భూతల దాడులకు కూడా సిద్దపడ్డాం
- ● భద్రతా సవాళ్లను ఎదుర్కోవ డంలో భారత్ సైనిక సంసిద్ధత
- ● షక్సాగామ్ వ్యాలీ ఎప్పటికీ భారత్‌లో భాగమే
- ● మీడియా సమావేశంలో ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది



**న్యూఢిల్లీ,జనవరి 13 :** ఉగ్రవాదులు తెగిస్తే గట్టిగా బుద్ధి చెబుతామని, ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోందని, త్రివిధ దళాల సమ న్వయానికి ఇది నిదర్శనమని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది అన్నారు. దిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆయన ..భద్రతా సవాళ్ల ను ఎదుర్కోవ డంలో భారత్ సైనిక సంసిద్ధత దీనిద్వారా స్పష్టమై ందని పేర్కొ న్నారు. ఆపరేషన్ సిందూర్‌ను చాలా కచ్చితత్వంతో అమలుచేశాం. 88 గంట ల పాటు సాగిన ఆ ఆపరేషన్‌లో మన సైనిక దళాలు అత్యంత సమర్థంగా పనిచేశాయి. ఉగ్ర మిగతా2లో...

# కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే అవకాశం లేదు

(మొదటి పేజీ తరువాయి)

కోదండరామ్ ఎమ్మెల్సీల విషయంలో మంచి స్పందన వస్తోందని నమ్ముతున్నట్లు తెలిపారు. ఏప్రిల్‌లో కార్పొరేషన్ ఛైర్మన్లను భర్తీ చేస్తామని ప్రకటించారు. పదవులు తక్కువ అయ్యాయని... ఆశావహులు ఎక్కువ అయ్యారని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల కోసం పార్టీ తరఫున ఒక కమిటీ వేస్తామని.. సర్వేల ఆధారంగా టికెట్లు ఇస్తామని చెప్పారు. గెలిచే అభ్యర్థులకే టికెట్ ఇస్తామని మహేశ్ కుమార్ పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పొత్తుపై పీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. బీజేపీని తెలంగాణాలో నమ్మే పరిస్థితి లేదన్నారు మహేశ్ కుమార్. మత రాజకీయాలు రాష్ట్రంలో నడవవని అన్నారు. రాముడికి, బీజేపీకి సంబంధమేంటి అని ఆయన ప్రశ్నించారు. తాము హిందూ ఆచారాలను పాటిస్తామని.. కానీ హిందూ సెంటిమెంట్‌తో ఓట్లు అడగమని తెలిపారు. తనకు, సీఎం రేవంత్ మధ్య మంచి సాన్నిహిత్యం ఉందన్నారు పీసీసీ చీఫ్. మంత్రులకు, సీఎంకు మధ్య ఎలాంటి గ్యాప్ లేదని మహేశ్ తేల్చిచెప్పారు. ఇతర మంత్రుల శాఖల్లో ముఖ్యమంత్రి తలదూర్చరన్నారు. మంత్రులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నారని వెల్లడించారు.

డీ సెంట్రలైజేషన్ కోసమే మేడారంలో క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేస్తున్నారని పీసీసీ చీఫ్ తెలిపారు. కేసీఆర్.. కుమారుడికి ఒక జిల్లా, కూతురికి ఒక జిల్లా, అల్లుడికి ఒక జిల్లా ఇచ్చారని పీసీసీ చీఫ్ ఆరోపణలు గుప్పించారు. కేసీఆర్ అశాస్త్రీయంగా జిల్లాలను విభజించారని మండిపడ్డారు.

శాస్త్రీయంగా జిల్లాల పునర్విభజన చేయాలని కమిటీ వేస్తున్నామని తెలిపారు. సికింద్రాబాద్‌ను ఎవరు ముట్టుకున్నారని తలసాని శ్రీనివాస్ యాదవ్ గాబరాపడుతున్నారని ప్రశ్నించారు. వ్యక్తిగత జీవితాలతో ఆడుకునే హక్కు ఎవరికీ లేదన్నారు. మహిళా అధికారులపై ఆధారాలు లేకుండా వార్తలు రాస్తే ఎంత ఇబ్బంది పడతారో అర్థం చేసుకోవాలన్నారు. సోషల్ మీడియాను కట్టడి చేయాలన్నారు. పదేళ్లలో వచ్చిన ఉద్యోగాలు ఎన్ని.. రెండేళ్లలో ఇచ్చిన ఉద్యోగాలు ఎన్నో నిరుద్యోగులు అర్థం చేసుకోవాలని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# కుంభమేళాకు మించి సమ్మక్క-సారలమ్మ జాతర

(మొదటి పేజీ తరువాయి)

మంత్రులు,అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అరవింద్ కుమార్, సబ్యసాచి ఘోష్, అడిషనల్ డీజీలు విజయ్ కుమార్, స్వాతి లక్రా, వివిధ శాఖ కార్యదర్శులు, ములుగు జిల్లా కలెక్టర్ దివాకర తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్షణ్ కుమార్ మాట్లాడుతూ, గత 2024 మేడారం జాతరకు కోటిన్నర మంది హాజరుకాగా, ఈసారి 2026 లో జాతరకు దాదాపు గతంలో ఎన్నడూ లేనివిధంగా రూ. 150 కోట్ల నిధులను మంజూరు చేసి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నందున ఈసారి దాదాపు మూడు కోట్ల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నామని వివరించారు. సమ్మక్క?సారలమ్మ జాతరను కుంభ మేళాకు మించి అద్భుతంగా నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వానికి జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకు రావాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులకు పిలుపునిచ్చారు. ఈ మహాజాతరను విజయవంతంగా నిర్వహించడం ప్రతి అధికారికి ఒక బాధ్యతగా తీసుకుని, ఏ చిన్న లోపం కూడా లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆయన సూచించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ జాతరకు రూ.150 కోట్లకుపైగా నిధులు కేటాయించి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. ఈ నిధులతో మౌలిక వసతులు, భద్రత, రవాణా, పారిశుద్ధ్యం, వైద్య సేవలు వంటి అన్ని విభాగాల్లో సమగ్ర ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. ఏ ఒక్క భక్తుడికి కూడా ఇబ్బంది కలగకూడదన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసిన మంత్రి, జాతరకు వచ్చే భక్తులు సులభంగా గమ్యానికి చేరుకునేలా అన్ని ప్రధాన రహదారులు, అంతర్గత మార్గాల్లో స్పష్టమైన దిశా సూచిక బోర్డులు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులు ఎలాంటి అయోమయానికి గురికాకుండా ట్రాఫిక్ నియంత్రణ పటిష్టంగా ఉండాలని, ప్రత్యేక రూట్ మ్యాప్‌లతో పాటు అవసరమైన చోట వన్‌వే వ్యవస్థ అమలు చేయాలని సూచించారు. ఈ జాతరపై క్యాబినెట్ మొత్తం ప్రత్యేక దృష్టి సారించిందని, మంత్రులందరూ సమన్వయంతో పనిచేస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారని మంత్రి అడ్లూరి తెలిపారు. మేడారం జాతరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2010 నుండి ప్రతీ సంవత్సరం వస్తున్నారని, వచ్చే వందేళ్లకు సరిపడా అభివృద్ధి కార్యక్రమాలకు మొట్టమొదటిసారిగా పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారని సీతక్క గుర్తు చేశారు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణ రావు మాట్లాడుతూ, జాతర నిర్వహణ ఏర్పాట్లపై రాష్ట్ర ముఖ్యమంత్రి నిరంతరం పర్యవేక్షిస్తున్నందున అన్ని శాఖల ఉన్నతాధికారులు జాతర పనులకు సకాలంలో పూర్తయ్యేలా ప్రత్యేక దృష్టి సాధించాలని పేర్కొన్నారు. జాతర సందర్భంగా భక్తులకు చేసిన ఏర్పాట్లు, రవాణా, ఇతర సౌకర్యాలు, భక్తులు పాటించాల్సిన సూచనలపై విస్తృత స్థాయిలో సమాచారాన్ని అందించాలని తెలిపారు. మేడారానికి వచ్చే ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ నియంత్రణకుగాను డ్రోన్ లను ఉపయోగించుకోవాలన్నారు. అదేవిధంగా, జాతర సమాచారాన్ని, నియమ నిబంధనలను తెలియచేసే ప్రత్యేక యాప్ ను/ క్యూ.ఆర్ కోడ్ రూపొందించి విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. పార్కింగ్ ఏరియాలలో కూడా ప్రత్యేకంగా వాటర్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. శానిటేషన్, పరిశుభ్రతపై ప్రత్యేక ద్రుష్టి సాధించాలన్నారు. ప్రస్తుతం మేడారంలో జరుగుతున్న జాతర ఏర్పాట్లు, పురోగతి తదితర విషయాలను తెలియచేసే నివేదికను ప్రతీ రోజూ తమకు సమర్పించాలని సంబంధిత శాఖల కార్యదర్శులను కోరారు. ఈ సందర్భంగా, మేడారం జాతరకు వివిధ శాఖలు చేస్తున్న ఏర్పాట్లు, చేపట్టిన పనులు, వాటి పురోగతి పై ములుగు జిల్లా కలెక్టర్ దివాకర పవర్ పాయింట్ ప్రసెంటేషన్ ద్వారా వివరించారు. ఈసారి జాతరకు దాదాపు మూడు కోట్ల మంది హాజరవుతారని అంచనా వేసినట్లు తెలిపారు. తదితర ప్రారంభానికి ముందే దాదాపు 30 శాతం భక్తులు సందర్శిస్తారని అన్నారు. జాతర సమయంలో 60 శాతం నుండి 65 శాతం వరకు, జాతర అనంతరం 5 శాతం భక్తులు మేడారం సందర్శిస్తారని వివరించారు. మేడారం జాతరపై ములుగు జిల్లా యంత్రాంగం రూపొందించిన ప్రత్యేక లోగో, యాప్, వీడియోలను మంత్రులు సీతక్క, లక్షణ్ కుమార్, సి.ఎస్ రామకృష్ణరావులు ఆవిష్కరించారు.

# ఉగ్రవాదానికి తెగిస్తే గట్టిగా బుద్ధి చెబుతాం

(మొదటి పేజీ తరువాయి)

శిబిరాలను నేలమట్టం చేయగలిగాం. దాదాపు 100 మంది ఉగ్రవాదులను హతమార్చాం. ఆ సమయంలో పెద్దఎత్తున బలగాలను సరిహద్దులకు తరలించాం. పాకిస్థాన్ చిన్న తప్పు చేసినా.. భూతల దాడులను ప్రారంభించేందుకు కూడా నాడు మేం పూర్తి సన్నద్ధంగా ఉన్నాం అని ఆర్మీ చీఫ్ నాటి పరిస్థితులను వివరించారు. అలాగే ఈశాన్య సరిహద్దులో పరిస్థితులు స్థిరంగానే ఉన్నాయని, అయితే అప్రమత్తంగా ఉండటం కీలకమని వెల్లడించారు. చైనా సరిహద్దులోని భద్రత గురించి మాట్లాడుతూ.. భారత మోహరింపులు బలంగా ఉన్నాయని చెప్పారు. భవిష్యత్‌లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు ఎదురైనా వాటిని సమర్థవంతంగా ఎదుర్కొంటామని పాకిస్థాన్‌కు పరోక్షంగా గట్టి హెచ్చరికలు చేశారు. జమ్మూకశ్మీర్‌లో పరిస్థితులు సున్నితంగానే ఉన్నా.. ప్రస్తుతం అవి నియంత్రణలోనే ఉన్నాయన్నారు. ఇక వివాదాస్పద షక్సాగామ్ వ్యాలీలోని ప్రాంతం తమ దేశంలో భాగమేనని చైనా చేసిన వాదనను భారత్ మరోసారి తిప్పికొట్టింది. ఆ వ్యాలీ అప్పగింతకు సంబంధించి 1963లో పాకిస్థాన్, చైనా మధ్య జరిగిన ఒప్పందం చట్టవిరుద్ధమని జనరల్ ఉపేంద్ర ద్వివేది వెల్లడించారు. ఈ వివాదం పై స్పందించారు. 'షక్సాగామ్ వ్యాలీని చైనాకు అప్పగిస్తూ బీజింగ్‌తో పాకిస్థాన్ చేసుకున్న ఒప్పందం చెల్లదు. ఆ ప్రాంతంలో జరిగే ఏ కార్యకలాపాలను మేం గుర్తించబోం. చైనా-పాక్ ఆర్థిక కారిడార్ విషయానికొస్తే.. అది ఆ రెండు దేశాలు సంయుక్తంగా చేస్తోన్న చట్టవిరుద్ధమైన చర్యగానే మేం పరిగణిస్తాం' అని జనరల్ ఉపేంద్ర ద్వివేది స్పష్టం చేశారు. షక్సాగామ్ వ్యాలీ ప్రాంతంలో చైనా చేపట్టిన అభివృద్ధి పనులపై ఈ నెల 9న భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. 'పాకిస్థాన్-చైనా పేర్కొంటున్న 1963 నాటి సరిహద్దు ఒప్పందాన్ని మేం ఎప్పటికీ గుర్తించబోం. దీనిపై మా నిర్ణయంపై మారదు. షక్సాగామ్ వ్యాలీ మా దేశంలో భాగమే అని స్పష్టం చేసింది. దీనిపై చైనా స్పందిస్తూ.. భారత్‌పై అక్కసు వెళ్లగక్కింది. ఆ ప్రాంతం తమ దేశంలో భాగమేనని, అక్కడ తాము చేపడుతున్న అభివృద్ధి పనులపై భారత్ అభ్యంతరం చెప్పడానికి అవకాశం లేదని పేర్కొంది. షక్సాగామ్ వ్యాలీ కీలకమైన కారకోరమ్ రహదారిలో ఉంది. స్వాతంత్ర్యం రాగానే పాకిస్థాన్ దీన్ని ఆక్రమించుకుంది. అనంతరం దీనికి చైనాకు ధారాదత్తం చేసింది. భారత్‌కు చెందిన ప్రాంతాన్ని ఆక్రమించుకుని మరొక దేశానికి ఇవ్వడం అంతర్జాతీయ చట్టాల ప్రకారం విరుద్ధం. ఈ వ్యాలీని బీజింగ్‌కు అప్పగించడం ద్వారా పాకిస్థాన్‌తో చైనాకు రహదారి సౌకర్యం ఏర్పడింది. దీని మీదుగానే చైనా-పాకిస్థాన్ ఆర్థిక నడవాను బీజింగ్ నిర్మిస్తోంది.

# గాంధీపేరుతో కాంగ్రెస్ నీచ రాజకీయం

(మొదటి పేజీ తరువాయి)

అలాగే గతంలో ఎన్టీఆర్ టెర్మినల్‌గా ఉన్న హైదరాబాద్ విమానాశ్రయ టెర్మినల్ పేరును తీసేసి రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుగా ఎందుకు మార్చారని బండి సంజయ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలపై తీవ్ర విమర్శలు గుప్పించిన ఆయన.. గాంధీ పేరును వాడుకున్నారే తప్ప మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని కాంగ్రెస్ నేతలు పాతరేసి ఆయన ఆత్మను క్షోభకు గురిచేశారని ఆరోపించారు. వారసత్వ రాజకీయాలను గాంధీ వ్యతిరేకించారని గుర్తుచేశారు. అలాగే ఆయన పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ వ్యాఖ్యలపై స్పందించారు. రాముడి బాటలో నడుస్తామని, రాముడి ఆలయాలను నిర్మిస్తామని తాము చెప్పినప్పుడు కాంగ్రెస్‌కు నొప్పి ఎందుకు వస్తోందని ప్రశ్నించారు. దేశంలో అనేక పథకాలు కేంద్ర,రాష్ట్ర భాగస్వామ్యంతోనే నడుస్తున్నాయని, ఈ పథకానికి రాష్ట్ర భాగస్వామ్యం కల్పిస్తే తప్పేముందని నిలదీశారు. ఉపాధి కూలీల వేతనాలను కూడా సకాలంలో ఇవ్వలేని కాంగ్రెస్ నేతలు మాట్లాడటం విడ్డూరమని విమర్శించారు. కరీంనగర్ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించిందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. అర్బన్ ఇన్‌ఫ్రాస్టక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు మొత్తం రూ.50 కోట్లు విడుదల చేసినట్లు ఆయన వెల్లడించారు. ఇందులో కేంద్ర వాటా రూ.40 కోట్లు ఉన్నట్లు పేర్కొన్నారు.

ఈ నిధులతో కరీంనగర్ రూపురేఖలు పూర్తిగా మారబోతున్నాయని అన్నారు. స్మార్ట్ సిటీ, స్వచ్ఛ భారత్, అమృత్ తదితర వివిధ కేంద్ర పథకాల ద్వారానే కరీంనగర్ అభివృద్ధి జరుగుతోందని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని కరీంనగర్ ప్రజలు గమనిస్తున్నారని అందుకే ఈసారి కార్పొరేషన్‌పై కాషాయ జెండా ఎగరేయడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. అన్ని పార్టీల నేతలు బీజేపీలోకి రావడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. టిక్కెట్ల కేటాయింపులో కాషాయ కార్యకర్తలకే మొదటి ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు ఆయన. అవినీతి ఆరోపణలు లేదా రౌడీషీట్లు ఉన్నవారిని పార్టీలోకి తీసుకోమని తేల్చిచెప్పారు. గతంలో కేసీఆర్ తన ఇష్టానుసారంగా కొడుకు, కూతురు, అల్లుడి కోసం కుటుంబ ఆస్తులు పంచినట్లే జిల్లాల ఏర్పాటు చేశారని ఆరోపించారు. అదే తరహాలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రజలకు మంచి జరుగు తుంటే కాంగ్రెస్‌కు ఎందుకు అక్కసు అని ప్రశ్నించిన బండి సంజయ్, గ్రామాల్లో ఆస్తులు నిర్మించడం తప్పా..? రైతులకు మేలు చేసే పథకం కాదా..? తెలంగాణకు అదనంగా రూ.340 కోట్లు వస్తుంటే వద్దంటారా..? అంటూ నిలదీశారు. వీబీజీ రామ్ జీ పథకం కావాలా..? వద్దా..? కాంగ్రెస్ స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు.

'వీబీ జీరామ్ జీ' పథకంతో ఉపాధి కూలీల ఆదాయం రెట్టింపు అవుతు ందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. 'ఈ పథకం ద్వారా ఏడాదికి 200 రోజుల ఉపాధి దొరుకు తుంది. పనుల విషయంలో కేంద్రం జోక్యం ఉండదు. ఈ పథకం కోసం గతంలో కంటే అదనంగా రూ.17 వేల కోట్లు వెచ్చిస్తున్నాం. తెలంగాణలో ఈ పథకం అమలుకు అదనంగా రూ.340 కోట్లు ఇవ్వబోతున్నాం. రైతులకు న్యాయం చేసేలా దీన్ని తీసుకొచ్చాం. వ్యవసాయ సీజన్‌లో ఈ పథకం పనులు జరగవు. దీంతో కూలీలు అందుబాటులో ఉంటారని తెలిపారు.

# ప్రారంభానికి సిద్ధంగా ప్రధాని కార్యాలయం

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించాయి. నిర్మాణ దశలో 'ఎగ్జిక్యూటివ్ ఎన్‌క్లేవ్' గా పిలిచిన ఈ సముదాయానికి కేంద్ర ప్రభుత్వం 'సేవా తీర్థ్' అని నామకరణం చేసింది. ఈ ప్రాంగణంలో మొత్తం మూడు మెయిన్ బిల్డింగులు ఉన్నాయి. ఒకదాంట్లో ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంవో) ఉంటుంది. రెండో భవనం నుంచి కేబినెట్ సెక్రటేరియెట్ విధులు సాగుతాయి. మూడో భవనంలో జాతీయ భద్రతా మండలి సెక్రటేరియట్(ఎన్‌ఎస్‌సీఎస్)తో పాటు జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ కార్యాలయం ఉంటుంది. కొత్త కార్యాలయంలో విదేశీ ప్రముఖులు, అతిథులతో సమావేశమయ్యేందుకు వీలుగా హై-ఎండ్ రూమ్‌లను రూపొందించారు. ఇవి అత్యాధునిక సాంకేతికతను కలిగి ఉండటమే కాకుండా.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉన్నాయి. ముఖ్యంగా కేబినెట్ సమావేశాల కోసం ఒక హాలును సిద్ధం చేశారు. అధికారుల మధ్య సమన్వయం పెంచేందుకు 'ఓపెన్ ఫ్లోర్' మోడల్‌ను ఇక్కడ అమలుచేస్తున్నారు. కాగా.. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ప్రధానమంత్రి కార్యాలయం సౌత్ బ్లాక్ నుంచే పనిచేస్తున్నది. తాజా మార్పుతో దశాబ్దాల చరిత్రకు తెరపడనుంది. నార్త్ బ్లాక్, సౌత్ బ్లాక్‌లలో ఉన్న హోం, ఫైనాన్స్, విదేశీ వ్యవహారాలు, రక్షణ శాఖలు ఇప్పటికే కొత్తగా నిర్మించిన 'కర్తవ్య భవన్' కు తరలివెళ్లాయి. ఖాళీ అయిన ఈ పురాతన కట్టడాలను భారీ మ్యూజియంగా మార్చనున్నారు. సేవా తీర్థ్ సమీపంలోనే ప్రధాని కొత్త నివాసం కూడా నిర్మాణం అవుతున్నది. ప్రస్తుతం 7 లోక్ కల్యాణ్ మార్గ్‌లో ఉన్న ప్రధాని నివాసాన్ని కూడా అక్కడికే మార్చనున్నారు.

# ఇరాన్ ఆందోళనల్లో భారీగా మరణాలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సంఖ్య రెండు వేల వరకు ఉండొచ్చని ఇరాన్ అధికారులు సంకేతాలిచ్చారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనల్లో పౌరులతో పాటు భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయినట్లు ఓ అంతర్జాతీయ మీడియా సంస్థతో ఇరాన్ అధికారులు వెల్లడించారు. అక్కడ పెరుగుతోన్న హింస చాలా భయపెడుతోందని ఐరాస మానవ హక్కుల సంఘం కూడా ఆందోళన వ్యక్తం చేసింది. ఇదే సమయంలో ఇరాన్‌కు చెందిన వెబ్‌సైట్ మాత్రం ఇటీవల ఆందోళనల్లో పది వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోయినట్లు సంచలన కథనంలో పేర్కొంది. ఈ మరణాల వెనక ఉగ్రవాదులు ఉన్నారని ఆరోపించారు. మరోవైపు ఇటీవల ఘర్షణల్లో 12 వేల మంది చనిపోయినట్లు 'ఇరాన్ ఇంటర్నేషనల్' కథనం పేర్కొంది. భద్రతా సంస్థలు, అధ్యక్ష కార్యాలయం, ప్రత్యక్ష సాక్షులు, వైద్యాధికారులు.. తదితర వర్గాల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ అంచనా వేసినట్లు తెలిపింది. జనవరి 8, 9 తేదీల్లోనే ఈ మరణాలు చోటుచేసుకున్నాయని, ఓ ప్రణాళిక ప్రకారమే ఈ హింసాత్మక ఘటనలు జరిగాయని వెల్లడించింది. ఆధునిక ఇరాన్ చరిత్రలో ఈ తరహా హింస ఎన్నడూ చోటుచేసుకోలేదని పేర్కొంది. దేశవ్యాప్తంగా 31 ప్రావిన్సుల్లో 600లకుపైగా ప్రదేశాల్లో నిరసనలు కొనసాగినట్లు అమెరికా కేంద్రంగా నడిచే మానవ హక్కుల కార్యకర్తల వార్తా సంస్థ పేర్కొంది. వందలాది మంది మృతి చెందగా, 10వేలకు పైగా నిరసనకారులను అక్కడి పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపింది. అయితే, ఈ భయంకరమైన హింసాత్మక ఘటనలు ఇలాగే కొనసాగితే చాలా కష్టమని.. ఇరాన్ పౌరుల న్యాయమైన డిమాండ్లను తప్పక వినాల్సిందేనని ఐరాస మానవ హక్కుల హైకమిషన్ పేర్కొంది. మరణాలు వందల సంఖ్యలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయని ఆ సంస్థ అధికార ప్రతినిధి జెరెమీ లారెన్స్ పేర్కొన్నారు. అంతేకాదు.. అరెస్టైన వారిలో అనేక మందికి మరణశిక్ష పడవచ్చనే ఆందోళన వ్యక్తం చేశారు.

# వీధి కుక్కల బాధ్యత రాష్ట్రాలదే

(మొదటి పేజీ తరువాయి)

ఆయా రాష్ట్రాలపై మేం నిర్దేశించిన భారీ పరిహారాలను చెల్లించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది.కుక్క కరిచిన ప్రభావం బాధిత వ్యక్తిపై జీవితకాలం ఉంటుందని న్యాయస్థానం పేర్కొంది. వీధి కుక్కలకు ఆహారం పెడుతున్న వారిపైనా కోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఏదైనా సంస్థ ఆహారం పెడుతున్న కుక్కల దాడిలో ఓ చిన్నారి మరణిస్తే.. అప్పుడు ఎవరిని బాధ్యుల్ని చేయాలి? ఆ ప్రాణనష్టానికి సదరు సంస్థ బాధ్యత వహించదా అని ప్రశ్నించింది. ఇక, వీధికుక్కలకు ఆహారం పెట్టే వారి గురించి మాట్లాడుతూ.. మీకు శునకాలపై అంత ప్రేమ ఉంటే.. వాటిని మీ ఇంటికి తీసుకెళ్లి పెంచుకోండి. వీధి కుక్కల సమస్య భావోద్వేగభరిత అంశమని అంటున్నారు. మీ భావోద్వేగం కేవలం కుక్కల పైన మాత్రమేనా? మేం మనుషుల గురించి కూడా సమానంగా ఆందోళన చెందుతున్నాం. కుక్కలు వీధుల్లో తిరుగుతూ ప్రజలను భయపెట్టే పరిస్థితిని మేం ఆమోదించబోం అని ధర్మాసనం వెల్లడించింది. దేశవ్యాప్తంగా వీధి కుక్కల దాడుల ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో గతేడాది నవంబరులో సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. విద్యాసంస్థలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, క్రీడా సముదాయాలు, ఇతర బహిరంగ ప్రదేశాల సమీపంలోని వాటిని షెల్టర్లకు తరలించాలని ఆదేశించింది. సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోంది.

# మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల తుదిజాబితా ప్రకటన

**హైదరాబాద్,జనవరి 13:**తెలంగాణలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితాను ప్రకటించింది. ఎన్నికలు జరగనున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో 52,43,023 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించింది. వీరిలో 25,62,369 మంది పురుష ఓటర్లు కాగా.. 26,80,014 మంది మహిళా ఓటర్లు, 640 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారు. పట్టణ స్థానిక సంస్థల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉండటం గమనార్హం. నిజామాబాద్ కార్పొరేషన్‌లో అత్యధికంగా 3,48,051 మంది ఓటర్లు ఉండగా.. కొత్తగూడెం కార్పొరేషన్‌లో అత్యల్పంగా 1,34,775 మంది ఓటర్లు ఉన్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో అత్యధికంగా 1,43,655 మంది ఓటర్లు ఉండగా.. అమరచింత మున్సిపాలిటీలో అత్యల్పంగా 9,147 మంది ఓటర్లు ఉన్నారు. రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల కోసం పురపాలకశాఖ కసరత్తు ముమ్మరం చేసింది. రిజర్వేషన్లు ఖరారైన తర్వాత నోటిఫికేషన్ విడుదల కానుంది. జనాభా ప్రాతిపదికన వార్డులు, డివిజన్లు, ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు. మొత్తం ఎన్నికల పర్వంలో రిజర్వేషన్ల ప్రక్రియ అత్యంత కీలకం కావడంతో అధికారులు దీనిని సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు. రాష్ట్రంలో గడువు ముగిసిన 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్ల ఎన్నికలకు రంగం సిద్ధమైన సంగతి తెలిసిందే.

# రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

(మొదటి పేజీ తరువాయి)

ధాన్య సంపదకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి పండగ చేసుకుంటున్న రైతులకు శుభాకాంక్షలు తెలిపారు.ప్రభుత్వం కొనుగోలు చేసిన 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంలో 32.45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దొడ్డు రకం కాగా, 38.37 లక్షల మెట్రిక్ టన్నులు సన్నాలని మంత్రి వివరించారు. తెలంగాణలో సాధించిన దిగుబడికిగాను రాష్ట్రవ్యాప్తంగా 13.97 లక్షల మంది రైతులకు మద్దతు ధర అందించామన్నారు.

# ఓటర్ల జాబితాలో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి : బిఎస్పీ



**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 13(డీడీ9 వార్త) :** బోధన్ మున్సిపాలిటీ పరిధిలోని 38 వార్డుల ఓటర్ల తుది జాబితాలో అనేక అవకతవకలు జరిగాయని, వాటిని వెంటనే సరిచేయాలని బహుజన సమాజ్ పార్టీ డిమాండ్ చేసింది. మంగళవారం బిఎస్పీ బోధన్ పట్టణ అధ్యక్షులు షైక్ మహ్మద్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా షైక్ మహ్మద్ మాట్లాడుతూ... మున్సిపల్ యంత్రాంగం నిన్న విడుదల చేసిన ఓటర్ల తుది జాబితాలో తీవ్రమైన తప్పులు దొర్లాయని మండిపడ్డారు. ఒకే వ్యక్తి పేరుతో రెండు ఓటర్ కార్డులు ఉన్నాయని పేర్కొన్నారు. చనిపోయిన వారి పేర్లను జాబితా నుండి తొలగించకుండా అలాగే కొనసాగించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒక వార్డుకు చెందిన వ్యక్తిని మరొక వార్డులో చేర్చడం వల్ల ఓటర్లు గందరగోళానికి గురవుతున్నారని వివరించారు. వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి, తప్పులను సరిదిద్ది మళ్ళీ పారదర్శకమైన తుది ఓటర్ల జాబితాను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బిఎస్పీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ బోధన్ అసెంబ్లీ అధ్యక్షులు దాడి రమేష్ దాస్, నాయకులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డల ఆశల్ని నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం

**- ఎమ్మెల్యే చేతుల మీదుగా కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ లబ్దిదారులకు ఆర్థిక భరోసా**





**బాన్సువాడ, జనవరి 13(డిడి9 వార్త):** బీర్కూర్ మండలంలోని బరంగ్ ఏడ్గి గ్రామానికి చెందిన నాచారం స్రవంతి, రెంజర్ల శైలజ, బొజ్జ రమ్య లకు మంగళవారం కల్యాణలక్ష్మి పథకం కింద మంజూరైన చెక్కులను తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ఘనంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్ ప్రత్యేకంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,"కాంగ్రెస్ ప్రభుత్వం ఆడబిడ్డల భవిష్యత్తుకు అండగా నిలుస్తోంది. పేద కుటుంబాల పెళ్లిళ్లకు పథకం ఒక వరం. లబ్ధి పొందిన వారు ప్రభుత్వానికి అండగా నిలవాలి" అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎఎంసీ డైరెక్టర్ గోండ్ల రాజు, పసుపుల రమేష్, కుమ్మరి గంగారాం, ఇందూర్ గజేందర్, హెుక్నారి అశోక్, కాదేపురం గంగారాం, సిద్దంశెట్టి శివరాజ్, బోయి సాయిలు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొని వేడుకను ఘనంగా నిర్వహించారు.

# జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌కు ఘనంగా పుట్టినరోజు శుభాకాంక్షలు

**- అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు శుభాకాంక్షలు తెలిపారు**

**కామారెడ్డి, జనవరి 13(డిడి9 వార్త):** మంగళవారం గౌరవ జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పుట్టినరోజు సందర్భంగా అదనపు కలెక్టర్లు విక్టర్, మధుమోహన్తో పాటు జిల్లా అధికారులు కలెక్టర్ కి ఘనంగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా జిల్లా కార్యాలయంలో ఆత్మీయ వాతావరణంలో శుభాకాంక్షలు అందజేస్తూ, జిల్లా అభివృద్ధికి కలెక్టర్ అందిస్తున్న సేవలను కొనియాడారు.



ప్రజాపరిపాలనలో ఆయన చూపిస్తున్న నిబద్ధత, కృషి జిల్లా పురోగతికి మార్గదర్శకంగా నిలుస్తోందని పేర్కొన్నారు.కలెక్టర్ కి ఆయురారోగ్యాలు, శక్తి, మరింత సేవాభిలాషతో జిల్లాను ముందుకు నడిపించే శక్తి కలగాలని వారు ఆకాంక్షించారు.

# మున్సిపల్ ఎన్నికల వేళ అప్రమత్తంగా ఉండాలి: సీపీ పి.సాయి చైతన్య

**నిజామాబాద్ జిల్లా జనవరి 13(డీడీ9 వార్త) :** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో త్వరలో జరగనున్న మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలను అత్యంత పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య అధికారులను ఆదేశించారు. మంగళవారం పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు అత్యంత కీలకమని వీటిని స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడంలో పోలీసుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రతి అధికారి, సిబ్బంది ఎన్నికల నియమావళిని తూ.చ. తప్పకుండా అమలు చేయాల వెల్లడినిచ్చారు. ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా, నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించి పోలీసు శాఖ ప్రతిష్ఠను పెంచాలని, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, ముందస్తు చర్యలు చేపట్టడం ద్వారా అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని సూచించారు. సామాన్య ప్రజల్లో భద్రతా భావాన్ని కల్పించేలా పోలీసుల చర్యలు ఉండాలని సీపీ స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా ఫిర్యాదు అందిన వెంటనే వేగంగా స్పందించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది



సమన్వయంతో పనిచేసి శాంతి భద్రతలను కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు డిసిపి (అడ్మిన్) బి.బస్వారెడ్డి, ఏసీపీలు రాజా వెంకటరెడ్డి నిజామాబాద్, శ్రీనివాస్ బోధన్, వెంకటేశ్వర్ రెడ్డి ఆర్మూర్, మస్తాన్ అలీ ట్రాఫిక్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీశైలం, సిసిఆర్బి ఇన్స్పెక్టర్ ఆర్.అంజయ్య, ఎలక్షన్ సెల్ ఇన్స్పెక్టర్ వీరయ్యతో పాటు జిల్లాలోని సీఐలు, హెచ్ఓలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# ప్రమాద రహిత జిల్లాగా మార్చుకుందాం : సీపీ పి.సాయి చైతన్య

**- కోవిడ్ మరణాల కంటే రోడ్డు ప్రమాద మృతులే ఎక్కువ**

**- అరైవ్ అలైవ్ ను ఒక తపస్సులా చేపట్టాలి**

**నిజామాబాద్ జిల్లా జనవరి 13(డీడీ9 వార్త) :** వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రాణాలను కాపాడుకోవాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య పిలుపునిచ్చారు. మంగళవారం రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ... గత రెండేళ్లలో కరోనా మహమ్మారి కారణంగా సంభవించిన మరణాల కంటే, రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారి సంఖ్య ఎక్కువగా ఉండటంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో మాస్కులు ధరించి జాగ్రత్త పడిన ప్రజలు, వాహనాలు నడిపేటప్పుడు మాత్రం కనీస రక్షణ కవచాలైన హెల్మెట్, సీటు బెల్టు పెట్టుకోకుండా నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. 2025లో ఒక్క జిల్లాలోనే 250 మంది రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడ్డారని గణాంకాలతో వివరించారు. రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ఒక బాధ్యతగా స్వీకరించాలని సీపీ కోరారు. యువత అతివేగం, సెల్ ఫోన్ డ్రైవింగ్ వంటి అలవాట్లకు దూరంగా ఉండాలని హితవు పలికారు. ప్రపంచంలోనే ఫిన్లాండ్ దేశం రోడ్డు ప్రమాదాల నివారణలో ఆదర్శంగా నిలిచిందని, మన జిల్లాను కూడా అదే స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

**హెల్మెట్ల పంపిణీ – రోడ్డు భద్రత ప్రతిజ్ఞ**

అంతర్జాతీయ బాక్సర్, అర్జున అవార్డు గ్రహీత హుసాముద్దిన్ మాట్లాడుతూ.. తన కుటుంబంలో ఒకరిని రోడ్డు ప్రమాదంలో కోల్పోవడం వల్ల కలిగిన వేదనను పంచుకుంటూ అందరూ జాగ్రత్తగా ఉండాలని కోరారు. అనంతరం విష్ణు సూపర్




స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో 100 మంది వాహనదారులకు హెల్మెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. రోడ్డు భద్రతా నిబంధనలపై రూపొందించిన టీ-షర్టులు, ప్లే కార్డులను సీపీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ బి.బస్వారెడ్డి, జిల్లా రవాణా అధికారి ఉమామహేశ్వర్, ఆర్టీసీ డిపో మేనేజర్ బి.ఎస్. ఆనంద్, ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ ఏ. విశాల్, న్యూరో సర్జన్ డాక్టర్ రమనేశ్వర్, ఏసీపీలు రాజా వెంకటరెడ్డి, మస్తాన్ అంబులెన్స్,ఆటో,క్యాబ్‌డ్రైవర్లసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజా బాటతో విద్యుత్ సమస్యల పరిష్కారం

**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 13(డీడీ9 వార్త) :** ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ అధికారులు ప్రజల చెంతకు చేరి సేవలందిస్తున్నారు. మంగళవారం బోధన్ టౌన్-1 సెక్షన్ పరిధిలోని రాకాసిపేటలో ప్రజా బాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఏడీఈ కే. నగేష్, ఏఈ నాయిని కృష్ణ స్వయంగా కాలనీల్లో పర్యటించి వినియోగదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు నేరుగా క్షేత్రస్థాయిలోకి వచ్చి సమస్యలను పరిష్కరించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సంక్రాంతి సంబరాల వేళ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా విద్యుత్ వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలని అధికారులు కోరారు. విద్యుత్ లైన్ల సమీపంలో గాలిపటాలు ఎగురవేయవద్దని, దారాలు తీగలకు చిక్కుకుంటే ప్రమాదాలు పొంచి ఉంటాయని హెచ్చరించారు. ఇళ్లలో తడి చేతులతో స్విచ్‌లు ముట్టుకోవద్దని, నాణ్యమైన ఐఎస్ఐ పరికరాలను మాత్రమే వాడాలని సూచించారు. క్షేత్రస్థాయిలో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు, పాత మీటర్లు, లూజ్ వైర్లు వంటి సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని లేదా




1912 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ ఓంప్రకాష్, విద్యుత్ శాఖ సిబ్బంది, రైతులు మరియు పెద్ద సంఖ్యలో వినియోగదారులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటిస్తేనే సురక్షిత ప్రయాణం : బోధన్ ఏసీపీ శ్రీనివాస్

**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 13(డీడీ9 వార్త) :** రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అరైవ్ అలైవ్, డిఫెన్సివ్ డ్రైవింగ్ పై అవగాహన కార్యక్రమాలు బోధన్ పట్టణంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. స్థానిక ఆర్టీసీ బస్ స్టేషన్ ఆవరణలో జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి బోధన్ ఏసీపీ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై అవగాహన సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ, వాహనదారులు చిన్నపాటి జాగ్రత్తలు పాటించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని సూచించారు. 10 రోజుల పాటు పట్టణంలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని కోరారు. రాంగ్ రూట్ డ్రైవింగ్, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వంటివి ప్రాణాంతకమని హెచ్చరించారు. జంక్షన్ల వద్ద సిగ్నల్ జంపింగ్ చేయకుండా ఉండాలని, ఆటో డ్రైవర్లు విధిగా యూనిఫాం ధరించి నిబంధనలు పాటించాలని దిశానిర్దేశం చేశారు. రోడ్డు




ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులను చూసి వెళ్ళిపోకుండా, తక్షణమే స్పందించి ప్రాథమిక చికిత్స అందేలా చూడాలని, గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి తరలిస్తే ప్రాణాలు కాపాడవచ్చునని ఏసీపీ పేర్కొన్నారు. ఆర్టీసీ సిబ్బంది, ఆటో డ్రైవర్లు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఈ సామాజిక బాధ్యతలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ కృష్ణ, ఏఎంవీఐ శ్రీనివాస్, ఎస్ఐ భాస్కరాచారి, ఎస్‌హెచ్‌వో వెంకటనారాయణతో పాటు ఆర్టీసీ అధికారులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# బాన్సువాడలో పేదింటి పెళ్లిళ్లకు పెద్ద భరోసా

**96 మంది లబ్ధిదారులకు ?96.11 లక్షల చెక్కుల పంపిణీ**









**బాన్సువాడ, జనవరి 13(డిడి9 వార్త):** బాన్సువాడ పట్టణ కేంద్రంలోని నివాసంలో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన 96 మంది కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ లబ్ధిదారులకు మొత్తం రూ.96,11,136/- విలువైన చెక్కులను తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ శాసనసభ్యులు శ్రీ పోచారం శ్రీనివాసరెడ్డి గారు, రాష్ట్ర అగ్రోస్ ఛైర్మన్ శ్రీ కాసుల బాలరాజు గారు చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో బాన్సువాడ మున్సిపాలిటీ, బాన్సువాడ గ్రామీణ, బీర్కూర్ మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాలు సామాజిక మార్పుకు నాంది పలుకుతున్నాయని అన్నారు. ఈ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని పేర్కొన్నారు. మండలాల వారీగా లబ్ధిదారులు బాన్సువాడ గ్రామీణ మండలం -- 40 మంది లబ్ధిదారులకు రూ.40,04,640/- బాన్సువాడ మున్సిపాలిటీ -- 37 మంది లబ్ధిదారులకు రూ.37,04,292/- బీర్కూర్ మండలం -- 19 మంది లబ్ధిదారులకు రూ.19,02, 204/- మొత్తం: 96 మంది లబ్ధిదారులకు రూ.96,11,136/-లబ్ధిదారులు ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలుపుతూ ఈ ఆర్థిక సహాయం తమ కుటుంబాలకు గొప్ప అండగా నిలిచిందని పేర్కొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాలపై సిడిపిఓ సౌభాగ్య అకస్మిక తనిఖీ

**- రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యరౌ మేమో జారీ, కఠిన హెచ్చరిక**



**బీర్కూర్, జనవరి 13(డిడి9 వార్త) :** బీర్కూర్ మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాలపై సిడిపిఓ సౌభాగ్య అకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లోని రికార్డుల నిర్వహణ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న అంగన్వాడీ సిబ్బందికి మేమోలు జారీ చేస్తాను అని కఠిన హెచ్చరికలు జారీ చేశారు.తనిఖీల్లో భాగంగా పిల్లల హాజరు పట్టిక, పోషకాహార సరఫరా రిజిస్టర్, గర్భిణీలు, పాలిచ్చే తల్లుల రికార్డులు, వృద్ధి పర్యవేక్షణ చార్ట్‌లు, ప్రభుత్వ పథకాల అమలు నివేదికలను సిడిపిఓ సవివరంగా పరిశీలించారు. అనేక కేంద్రాల్లో రికార్డులు అప్డేట్ కాకపోవడం, సక్రమంగా నిర్వహించకపోవడం, సమాచారంలో పొరపాట్లు కనిపించడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రభుత్వం చిన్నారులు, తల్లుల సంక్షేమానికి కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా అమలులో నిర్లక్ష్యం ఏ మాత్రం సహించేది లేదని సిడిపిఓ స్పష్టం చేశారు. విధులు నిర్వర్తించడంలో మరింత శ్రద్ధ చూపకపోతే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.అంగన్వాడీ కేంద్రాలు సమాజానికి మూలాధారం వంటివని, పిల్లల ఆరోగ్యం, పోషణ, విద్యలో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొంటూ, ప్రతి రికార్డు సక్రమంగా నిర్వహించాల్సిందేనని, ప్రతి సేవ లబ్ధిదారుడికి చేరాల్సిందేనని అధికారులకు స్పష్టం చేశారు.తనిఖీల అనంతరం తక్షణమే లోపాలు సరిచేయాలని, పర్యవేక్షణ మరింత కఠినతరం చేస్తామని సిడిపిఓ తెలిపారు.

# జాతీయ యువజన దినోత్సవం -- సేవే లక్ష్యంగా యువత

**- బాన్సువాడ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ**

**- మేరా యువ భారత్ సేవా సంఘ్**

**- ఫ్రెండ్స్ యూత్ సేవా కార్యక్రమం**











**బాన్సువాడ,జనవరి 13(డిడి9 వార్త):** జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా మేరా యువ భారత్ సేవా సంఘ్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో బాన్సువాడ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సునీల్ రాథోడ్ మాట్లాడుతూ భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పిన మహానుభావుడు స్వామి వివేకానంద. అతి చిన్న వయసులోనే తన పేరును మరో వెయ్యి సంవత్సరాల పాటు నిలిచేలా చేసిన మహాగురువు. యువతకు ఆయనే ఆదర్శం అని పేర్కొన్నారు.స్వామి వివేకానంద 163వ జయంతి సందర్భంగా ఈ సేవా కార్యక్రమాన్ని ఏరియా హాస్పిటల్ ఆర్ఎంఓ డాక్టర్ సుజాత, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ శ్రీలత, ఎయిడ్స్ కౌన్సిలర్ చేతుల మీదుగా రోగులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆర్ఎంఓ డాక్టర్ సుజాత మాట్లాడుతూ స్వామి వివేకానంద భారతదేశ గౌరవాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన విశ్వగురు. నేటితరం యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి అని యువతకు సందేశమిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య జ్యోతి హెడ్ నర్స్ అమృత, హెడ్ నర్స్ ఎలిజబెత్, పురుషోత్తం, నర్సింలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్య బాధితుడికి సీఎంఆర్ఎఫ్ భరోసా

**- బరంగేడ్గిలో లక్కపల్లి గంగొండకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ**

**- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్ ఆదేశాలతో సిఎంఆర్ఎఫ్ అందజేత**



**బాన్సువాడ, జనవరి 13(డిడి9 వార్త):** బీర్కూర్ మండలంలోని బరంగ్ ఏడ్గి గ్రామంలో మంగళవారం గ్రామ పెద్దల సమక్షంలో గ్రామానికి చెందిన ఇల్తెం పోషవ్వ కుమారుడు లక్కపల్లి గంగొండకి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేశారు.తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మరియు తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్ ఆదేశాల మేరకు, అనారోగ్యంతో బాధపడుతున్న లక్కపల్లి గంగొండ ని ఆదుకునేందుకు ఈ ఆర్థిక సహాయాన్ని అందించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,"ప్రజల కష్టసుఖాల్లో ప్రభుత్వం అండగా ఉంటుంది. ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేదల పాలిట వరం" అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గోండ్ల రాజు, నాయకులు శివ దేశాయ్, పసుపుల రమేష్, కుమ్మరి గంగారాం, ఇందూర్ గజేందర్, హెుక్నారి అశోక్, మొండ్కారి కామప్ప, కాదేపురం గంగారాం, ఫుల్కంటి హన్మగొండ, సందుల రవి, హట్కారి నర్సింగ్, మొండ్కారి వీరప్ప, వడ్ల నాగయ్య, శావులం శంకర్, కోరె హావగిర్ రావు, చాకలి సురేష్, సిద్ధంశెట్టి శివరాజ్, హట్కారి దశరథ్, లక్కపల్లి మొగులుగొండ, ముత్యం సతీష్, మేత్రి చాందు, క్యాదని లింగప్ప, వడ్ల నారాయణ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బోర్లాం గ్రామంలో 'అరైవ్ అలైవ్ణ అవగాహన కార్యక్రమం

**- రోడ్డు భద్రతపై ప్రజలకు స్పష్టమైన సందేశం**







**బాన్సువాడ, జనవరి 13(డిడి9 వార్త):** బోర్లాం గ్రామంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ఉద్దేశించిన 'అరైవ్ అలైవ్ణ అవగాహన కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిఎస్పీ విట్టల్ రెడ్డి, బాన్సువాడ సిఐ తులా శ్రీధర్ , గ్రామ సర్పంచ్ రమేష్, వార్డు సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ,రోడ్డుపై ప్రయాణించే ప్రతి వ్యక్తి భద్రతకు బాధ్యత వహించాల్సిన అవసరం ఉందని,హెల్మెట్ ధరించడం, సీటుబెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపకూడదనే అంశాలపై ప్రజలకు స్పష్టంగా వివరించారు.అతి వేగమే ఎక్కువ ప్రమాదాలకు కారణమని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.బాన్సువాడ సిఐ మాట్లాడుతూ,గ్రామ స్థాయిలో ఈ తరహా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజల్లో మార్పు వస్తుందని,రోడ్డు ప్రమాదాలు తగ్గేందుకు 'అరైవ్ అలైవ్ణ వంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు మాట్లాడుతూ,
గ్రామ ప్రజలు ఈ సూచనలను ఆచరణలో పెట్టి తమ కుటుంబాల భద్రతను కాపాడుకోవాలని కోరారు.గ్రామస్తులు కూడా కార్యక్రమంలో చురుకుగా పాల్గొని పోలీస్ అధికారుల సూచనలను శ్రద్ధగా విన్నారు.ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలో రోడ్డు భద్రతపై అవగాహన మరింత పెరిగిందని,ప్రజలలో బాధ్యతాభావం ఏర్పడిందని నిర్వాహకులు తెలిపారు.

# దామరంచ నూతన సర్పంచ్ బోయిని శంకర్‌కు ఘన సన్మానం

**- మియ్యాపురం శశికాంత్ ఆధ్వర్యంలో అభినందనలు**



**బాన్సువాడ, జనవరి 13(డిడి9 వార్త):** బీర్కూర్ మండలం దామరంచ గ్రామానికి నూతనంగా ఎన్నికైన సర్పంచ్ బోయిని శంకర్ ని మండల నాయకుడు మియ్యాపురం శశికాంత్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి కృషి చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్న సర్పంచ్ శంకర్ ని శాలువాతో ఘనంగా సన్మానించారు.గ్రామానికి మరింత మెరుగైన మౌలిక వసతులు, సంక్షేమ కార్యక్రమాలు అందించేందుకు ప్రజాప్రతినిధులు సమిష్టిగా పని చేయాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు. నూతన సర్పంచ్ బోయిని శంకర్ గ్రామ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ దామరంచ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఇంటెనుక శంకర్, వార్డు సభ్యులు కూర్మ లక్ష్మణ్, మంగలి అంబాజీ, సత్యనారాయణ తదితరులు పాల్గొని సర్పంచ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.గ్రామంలో ఐక్యతతో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించాలని నాయకులు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# ఎడపల్లిలో తప్పిన విద్యుత్ ప్రమాదం

**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 13 (డీడీ9 వార్త) :** ఎడపల్లి మండల కేంద్రంలోని 5వ వార్డులో మంగళవారం భారీ ప్రమాదం తప్పింది. గాలిపటాలు ఎగురవేస్తున్న క్రమంలో విద్యుత్ తీగలు తెగి కిందపడటంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. సంక్రాంతి పండుగ కోసం చిన్నారులు ముందస్తుగా గాలిపటాలు ఎగురవేస్తున్నారు. ఈ క్రమంలో ఒక గాలిపటం మాంజా విద్యుత్ తీగలకు చిక్కుకోగా, పిల్లలు దానిని బలంగా లాగారు. దీంతో విద్యుత్ తీగలు ఒక్కసారిగా తెగి వీధిలో పడ్డాయి. అదే సమయంలో ఆ దారిలో మహిళలు నడుచుకుంటూ వెళ్తుండటంతో, తీగలు వారి పక్కనే పడటంతో పెను ప్రమాదం తృటిలో తప్పింది. స్థానికులు తక్షణమే స్పందించి విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో సరఫరా నిలిపివేశారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పండుగ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యుత్ తీగల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు

DD9 వార్త
తెలుగు దినపత్రిక
బుధవారం
జనవరి 14 2026



# యోగామిత్ర బృందం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు






**నిజామాబాద్ జిల్లా జనవరి 13 (డీడీ9 వార్త) :**
సంక్రాంతి పండుగను పురస్కరించుకొని భీంగల్ పట్టణంలో యోగామిత్ర బృందం ఆధ్వర్యంలో మంగళవారం ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. స్థానిక సరస్వతి విద్యామందిర్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో సుమారు 35 మంది మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంప్రదాయబద్ధంగా రంగురంగుల ముగ్గులు వేసి తమ ప్రతిభను చాటారు. అనంతరం ఏర్పాటు చేసిన బహుమతుల ప్రధానోత్సవంలో రిటైర్డ్ డీఎండీహెచ్ఓ, ప్రముఖ వైద్యులు డాక్టర్ బసంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీలలో కట్ట లాస్య ప్రథమ బహుమతి గెలుచుకోగా, జవ్వాజి ప్రజ్ఞ ద్వితీయ, రింశా తృతీయ బహుమతిని సాధించారు. మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడటంలో మహిళల పాత్ర కీలకమని, పండుగ వేళ ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమని డాక్టర్ బసంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యోగామిత్ర బృందం సభ్యులు, మహిళలు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# బీర్కూర్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షల శిబిరం



**బాన్సువాడ, జనవరి 13(డిడి9 వార్త):**
బీర్కూర్ మండల కేంద్రంలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రజలకు ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో మొత్తం 25 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించగా, ముగ్గురు రోగులను మెరుగైన చికిత్స కోసం బోధన్ లయన్స్ హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. మిగతా రోగులకు అవసరమైన వైద్య సూచనలు, మందులు అందించారు. ఈ సేవా కార్యక్రమంలో లయన్స్ కంటి వైద్య సహాయకులు సతీష్, లయన్స్ మండల అధ్యక్షులు సితలె రమేష్, జోన్ చైర్మన్ కొట్టురీ సంతోష్ పాల్గొని శిబిరాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కంటి ఆరోగ్యం పట్ల అవగాహన పెంచడమే లక్ష్యంగా లయన్స్ క్లబ్ ఇటువంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ఉచిత వైద్య శిబిరం బీర్కూర్ ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా నిలిచిందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

# చైనా మాంజా కోసుకుపోయి వృద్ధురాలికి తీవ్ర గాయాలు



**రంగారెడ్డి :** హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. అల్మాస్‌గూడ ప్రధాన రహదారిపై రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న యాదమ్మ (70) అనే వృద్ధురాలి కాలికి చైనా మాంజా కాలికి చుట్టుకుంది. ఈ ఘటనలో ఆమె కాలు తీవ్రంగా కోసుకుపోయి భారీగా రక్తస్రావం జరిగింది. గమనించిన స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన వృద్ధురాలిని సమీపంలోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు.
ప్రస్తుతం ఆమె అక్కడ చికిత్స పొందుతున్నట్లు సమాచారం. నిషేధిత చైనా మాంజా వినియోగం వల్ల ప్రజల ప్రాణాలకు తీవ్ర ముప్పు ఏర్పడుతున్నప్పటికీ, ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతుండటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చైనా మాంజా విక్రయాలు, వినియోగంపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# బిచ్కుంద అభివృద్ధికి బలమైన బాట

**- రూ.15 కోట్ల పనులకు శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు**






**జుక్కల్, జనవరి 13(డిడి9 వార్త):**
బిచ్కుంద మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పరుగులు పెట్టాయి. పట్టణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చే దిశగా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు మంగళవారం ఘనంగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. కల్వర్టుల నిర్మాణం, వరద నీటి నివారణ, మురికి నీటి కాలువలు, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం వంటి కీలక మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే పట్టణ ప్రజలకు శాశ్వత పరిష్కారాలు లభించనున్నాయి. సుమారు రూ. 15 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో నాణ్యత, వేగం రెండింటికీ పెద్దపీట వేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ప్రజాసేవలో ముందుండే మున్సిపల్ సిబ్బందికి ఎమ్మెల్యే యూనిఫార్మ్‌లను పంపిణీ చేసి, వారికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, పట్టణ ప్రజలు భారీగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రాణాలు కాపాడండి





**ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్,జనవరి,13,(డిడి9వార్త న్యూస్ ):-**
రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రయాణీకుల, ప్రజల ప్రాణాలుగాలిలో హరించుక పోకుండా కాపాడాలని ఆదిలాబాద్ సీనియర్ ఎంవిఐ,ఏ.శ్రీనివాస్,ఎంవిఐ ప్రదీప్ కుమార్లుసూచిస్తూ, అవగాహనాకల్పించారు. మంగళవారం రోజు బజార్హత్నూ ర్ మండల కేంద్రంలోని రైతువేదికలో రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా ఒక సమావేశం ఏర్పాటుచేసిఆటో డ్రైవర్లు, సైకిల్ మోటర్ యజమానులకు, జీపు,వ్యాన్, ట్రాక్టర్,తదితరవాహనాలు గల వారికీ, ప్రజలకు రోడ్డు భద్రత నియమాల విషయం పై పూర్తి విషయాలు వివరించారు. వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని, సీటుబెల్ట్ పెట్టుకోవాలనితెలిపారు. పరిమితికంటే ఎక్కువప్రయానీకులను ఎక్కించుకోరాదనీ, వాహనాలు చిన్న పిల్లలకు ఇచ్చి తొలమని చెప్పడంగానీ చేయకూడదన్నారు. పాత వాహనాలు పక్కన పెట్టి లైఫ్ టైం ఉన్న వాహనాలుశీచుకొని, లైసెన్సులు, ఆర్ సి, పొల్యూషన్ ధ్రువీకరణ ఉండునట్లు చూసుకోవాలని సూచించారు. ఇన్సూరెన్స్ కల్గిఉంటే కూడామంచిదని తెలిపారు. చివరగా రోడ్డు భద్రత నియమాలు పాటిస్తామని ప్రమాణం చేయాలని ప్రమాణం చేయించారు. ఈకార్యక్రమంకుబజార్ హత్నూర్ సర్పంచ్ పర్చ సాయన్నఅధ్యక్షత వహించగా, సీనియర్ ఎంవీఐ ఏ శ్రీనివాస్, ఎంవీఐ ప్రదీప్ కుమార్,అసిస్టెంట్ ఎంవీఐ శ్వేత,ఆర్టీ ఏ సిబ్బంది, బజార్ హత్నూర్ నాయకులు చట్ల వినీల్ కుమార్,జాన్ డీర్ ట్రాక్టర్ కంపెనీ ప్రతినిధి భీమ్ రావ్ పాటిల్ పలువురు డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి పట్టణంలో సీసీ రోడ్ల ప్రారంభం అభివృద్ధికి మరో మెట్టు

**- పట్టణ రూపురేఖలు మారుతున్నాయి**

**- వర్షకాల కష్టాలకు చెక్ --- సీసీ రోడ్లతో పరిష్కారం**

**- షబ్బీర్ అలీ చేతుల మీదుగా కామారెడ్డిలో కొత్త సీసీ రోడ్లు**





**కామారెడ్డి, జనవరి 13(డిడి9 వార్త):**
కామారెడ్డి పట్టణంలో మౌలిక వసతుల విస్తరణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా, 20, 21, 22, 23 వార్డుల పరిధిలోని బొంబాయి కాలనీ, రాజీవ్ కాలనీల్లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ, పట్టణంలోని ప్రతి కాలనీకి సమానంగా అభివృద్ధి ఫలాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. మౌలిక వసతుల కల్పన ద్వారానే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఈ రోడ్ల నిర్మాణంతో వర్షాకాలంలో ఏర్పడే సమస్యలు తొలగి, రాకపోకలు మరింత సులభతరం అవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు పండ్ల రాజు, నాయకులు సత్యం, యూనుస్, ప్రసాద్తో పాటు స్థానిక ప్రజలు, మహిళలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రాంత ప్రజలు ఈ అభివృద్ధి పనుల పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ, పట్టణ రూపురేఖలు మారుతున్నాయంటూ ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధు లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సీసీ రోడ్లు రాబోయే రోజుల్లో కాలనీలకు మరింత శోభను తీసుకురావడంతో పాటు ప్రజల జీవనశైలిని మెరుగుపరచనున్నాయని స్థానికులు అభిప్రాయపడ్డారు.



# మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు 3,495 ఆర్టీసీ స్పెషల్? బస్సులు



**మేడారం :** ఈ నెల 28 నుంచి 31 వరకు మేడారంలో సమ్మక్క- సారలమ్మ జాతర వైభవంగా జరగనుంది. ఈ నేపథ్యంలో తెలంగాణ ఆర్టీసీ అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈసారి 3,495 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు తెలిపింది. అవసరమైతే మరిన్ని బస్సులు నడిపే విధంగా కార్యాచరణ ఉంటుందని వెల్లడించింది. వీటిలో సాధారణ ఛార్జీకి 50 శాతం అదనపు మొత్తాన్ని జోడించి వసూలు చేయనున్నట్లు పేర్కొంది. ప్రత్యేక పండుగలు, జాతరలు, ఇతర ఉత్సవాల సమయంలో నడిపే ప్రత్యేక బస్సుల్లో 50 శాతం వరకు ఛార్జీలు పెంచుకునేందుకు ఆర్టీసీకి 2003 నుంచి అనుమతి ఉంది.

ఈ బస్సుల్లో మహాలక్ష్మీ పథకం : గత జాతర సమయంలో ఆర్టీసీ 3,491 ప్రత్యేక బస్సులు నడిపితే అవి కీలక సమయాల్లో కొంత వరకు సరిపోలేదు. దీంతో భక్తులు అసౌకర్యానికి గురై అసహనం వ్యక్తం చేశారు. గత పొరపాట్లను గుర్తించిన సంస్థ ఈసారి అవి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టడానికి సిద్ధమయ్యింది. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను ప్రజల సౌకర్యార్థం నడపనుంది. ఈ బస్సుల్లో కూడా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఉంటుందని ఆర్టీసీ స్పష్టం చేసింది. ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం అందుబాటులో ఉంటుందని పేర్కొంది.మేడారం మహాజాతర నిర్వహణలో ఆర్టీసీ మరింత కీలకం కానుంది. మరో రెండు వారాల్లో ప్రారంభం కానున్న జాతర ఏర్పాట్ల కోసం ప్రభుత్వం ఆర్టీసీకి నిధులు కేటాయించింది. ఇప్పటికే హనుమకొండ, వరంగల్ బస్టాండ్ల నుంచి పలు సర్వీసులు కూడా ప్రారంభమయ్యాయి. గత జాతరలో 20 లక్షల మంది భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించగా ఈసారి ఆ సంఖ్య 30 లక్షల మందికి చేరుకుంటుందనే అంచనాతో ప్రణాళికలు రూపొందించుకొని ముందుకెళ్తోంది.

రూ.4.35 కోట్లతో పనులు : మేడారం జాతర నిర్వహణ కోసం ప్రభుత్వం ఆర్టీసీకి రూ.4.35 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ నిధులతో 15 రకాలైనటువంటి పనులను చేపడుతోంది. తాత్కాలిక బస్టాండు, బస, అలైటింగ్, బోర్డింగ్ చదును, క్యూలైన్లు, టిక్కెట్ల కౌంటర్, పార్కింగ్ స్థలాలు, క్యాంటీన్, అధికారులు, సిబ్బందికి కావాల్సిన వసతి, తాగునీరు, విశ్రాంతి గదులు, కమాండ్ కంట్రోల్ రూం, తాత్కాలిక మరుగుదొడ్లు, తదితర ఏర్పాట్లు చేస్తున్నారు. బస్టాండును వారం రోజుల్లో సిద్ధం చేసి ఈనెల 23న మంత్రుల చేతుల మీదుగా ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నారు.14 వేల మంది సిబ్బంది : గత జాతరలో మూడు వేలకు పైగా ఆర్టీసీ బస్సులను వినియోగించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించింది. దీంతో బస్సుల సంఖ్యను పెంచారు. 4 వేల బస్సులను సిద్ధం చేస్తుండగా ఖమ్మం, ఆదిలాబాద్, నిజమాబాద్, కరీంనగర్, వరంగల్ రీజియన్లలోని 51 పాయింట్ల నుంచి నడవనున్నాయి. ఈనెల 25 నుంచి ఆయాప్రాంతాల నుంచి ఆర్టీసీ సేవలు ప్రారంభమవుతాయి. మొత్తం 14 వేల ఆర్టీసీ సిబ్బంది సేవలు అందించనున్నారు. హైదరాబాద్ నగరం నుంచి ఏసీ బస్సులు ఏర్పాటు చేయగా ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ సదుపాయం మాత్రం ఇంకా కల్పించలేదు. రద్దీకి అనుగుణంగా ఏసీ బస్సులను కేటాయించనున్నారు.

జాతరలో 50 ఎకరాల స్థలంలో ఆర్టీసీ రకరకాల ఏర్పాట్లు చేస్తోంది. 20 ఎకరాల్లో బస్టాండు, 20 ఎకరాల్లో పార్కింగ్ కోసం స్థలం కేటాయించారు. తాడ్వాయి వద్ద టిక్కెట్లు జారీ చేయనుండటంతో ఇక్కడ మరో ఆరెకరాలను అవసరాలకు తీసుకున్నారు. ట్రాఫిక్ ఎక్కువగా ఉండి స్థలం సరిపోకపోతే కామారం ప్రాంతంలో మరో 15 ఎకరాలను అధికారులు సిద్ధం చేశారు. మేడారం ప్రయాణ ప్రాంగణంలో 52 క్యూరైలింగ్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 25 ప్రయాణ ప్రాంగణాలను తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్నారు.

# బ్యాంక్ అకౌంట్ నుంచే నేరుగా ట్రాఫిక్ చలాన్ కట్.. తీవ్రంగా ఖండించిన బీఆర్‌టీయూ

**హైదరాబాద్ (డిడి9 వార్త)** బ్యాంక్ అకౌంట్ నుంచే నేరుగా ట్రాఫిక్ చలానా కట్ చేయాలన్న సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయాన్ని భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ (బీఆర్‌టీయూ) తీవ్రంగా ఖండించింది. వాహన రిజిస్ట్రేషన్ ప్రక్రియలో బ్యాంక్ అకౌంట్‌ను తప్పనిసరిగా జత చేయాలన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలు, వ్యక్తిగత స్వేచ్ఛకు విరుద్ధమైనదని బీఆర్‌టీయూ ఉపాధ్యక్షులు అత్తినమోని నాగేశ్ కుమార్ విమర్శించారు. ఇది ప్రజల హక్కులను హరించే ప్రమాదకర నిర్ణయమని పేర్కొన్నారు. ఇప్పటికే ట్రాఫిక్ పోలీసులు చెట్టు చాటున, పుట్ట చాటున దాగి ఫోటోలు తీసి చలానాలు విధిస్తున్న పరిస్థితి ఉందని ఆయన అన్నారు.



అలాంటి సందర్భాల్లో బ్యాంక్ అకౌంట్‌ను ఆటోమేటిక్‌గా లింక్ చేయడం అంటే ప్రజల ఖాతాల నుంచి నేరుగా డబ్బు కట్ చేసే నియంతృత్వ పోకడలకు నిదర్శనమని విమర్శించారు ఇది కేవలం ప్రభుత్వ ఖజానాను నింపుకోవడానికి తీసుకుంటున్న నిర్ణయమే తప్ప, పాలనలో సంస్కరణలు తీసుకురావాలన్న నిజమైన ఉద్దేశం కనిపించడం లేదని మండిపడ్డారు.రోడ్లపై యూటర్న్‌లు శాస్త్రీయంగా లేవని.. కొన్నిచోట్ల కిలోమీటర్ల కొద్దీ తిరిగి యూటర్న్ తీసుకోవాల్సిన దుస్థితి ఉందని తెలిపారు. రోడ్లపై గుంతల కారణంగా ప్రతి సంవత్సరం వేలాదిమంది ప్రాణాలు కోల్పోతున్నారని.. అయినా ఈ సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని అన్నారు. నగరాల్లో షాపింగ్ మాల్స్‌కు సరైన పార్కింగ్ సదుపాయం లేకపోయినా అనుమతులు ఇస్తున్నారని ప్రస్తావించారు. ఆ మాల్స్ వద్ద రోడ్లపై పార్క్ చేసిన వాహనాలకు మాత్రం జరిమానాలు విధిస్తున్నారని.. ఇది పూర్తిగా ప్రజలపై భారం మోపే విధానమే అని మండిపడ్డారు.

కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ చేయాల్సిన పోలీసులు, ఒకవైపు ఫోటోలు తీస్తూ చలానాలు వసూలు చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. అటువంటి పరిస్థితుల్లో ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. పాలనలో సంస్కరణలు తీసుకురావాల్సిన ప్రభుత్వం, ప్రజల నుంచే వసూలు చేస్తామని చెప్పడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఈ నిర్ణయాలు ప్రభుత్వ పతనానికి నాంది పలుకుతున్నాయన్నారు. ముఖ్యంగా మధ్యతరగతి, పేద కుటుంబాలను మరింతగా పీడించే ప్రయత్నంగా ఇది కనిపిస్తోందని తెలిపారు.చట్టం ధనవంతులకు ఒకటి, పేదలకు ఇంకొకటా? అప్పుడు పేదోళ్లు పేదలే, ఇప్పుడూ పేదలే కాదా? అని నాగేశ్‌కుమార్ మండిపడ్డారు. ప్రభుత్వం నిజంగా బాధ్యత వహించాలనుకుంటే, సీఎం, మంత్రుల బ్యాంక్ అకౌంట్లను కూడా ప్రజలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మీరు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోయినా, రోడ్లు వేయకపోయినా, పార్కింగ్ సదుపాయాలు కల్పించకపోయినా, జీబ్రా క్రాసింగ్లు లేకపోయినా, ట్రాఫిక్ పోలీసులు ఫోటోగ్రఫీ తప్ప మరో పని చేయకపోయినా.. అప్పుడు ప్రజలు ఫైన్ కట్టి మీ అకౌంట్ల నుంచి డబ్బు తీసుకోవాలా అని ప్రశ్నించారు.

# టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో ఘనంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు

## కామారెడ్డి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సంబర వాతావరణం









**కామారెడ్డి, జనవరి 13(డిడి9 వార్త):** టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు -- 2026 కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు నరాల వెంకట్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అన్ని శాఖల మహిళా ఉద్యోగులకు సంప్రదాయబద్ధంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్లు విక్టర్ మరియు మధుమోహన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబర్చిన మహిళా ఉద్యోగులకు బహుమతులు అందజేశారు.విజేతలు ముగ్గుల పోటీలలోప్రథమ బహుమతి -- శాంభవి, శాంతి (విద్యా శాఖ),ద్వితీయ బహుమతి -- రోజారాణి, రవళి (రెవెన్యూ శాఖ), గౌతమి, అరుణ (మత్స్య శాఖ),తృతీయ బహుమతి -- ప్రియాంక, పద్మ (ఆడిట్, చీఫ్ ప్లానింగ్ శాఖ) గెలుచుకున్నారు. పాల్గొన్న ప్రతి మహిళా ఉద్యోగికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు.అధికారుల సందేశం ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ,' 'ముగ్గుల పోటీలు సంప్రదాయానికి ప్రతీక. మహిళా ఉద్యోగులు అన్ని రంగాల్లో ముందుండి జిల్లా అభివృద్ధికి తోడ్పడాలి" అని తెలిపారు. జిల్లా ఉద్యోగులందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.అదనపు కలెక్టర్ మధుమోహ న్ మాట్లాడుతూ," టీఎన్జీవోస్ ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ కార్యక్రమం ప్రశంసనీయం. ఇది ఉద్యోగుల్లో సాంస్కృతిక చైతన్యాన్ని పెంచుతోంది" అని పేర్కొన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న వారు జిల్లా అధ్యక్షులు నరాల వెంకట్ రెడ్డి,కార్యదర్శి ముల్క నాగరాజు,కోశాధికారి ఎం. దేవరాజు,ఉపాధ్యక్షులు రాజ్యలక్ష్మి, ఎంసీ పోచయ్య,ఆర్గనైజింగ్ సెక్రటరీ సంతోష్ కుమార్, కల్చరల్ సెక్రటరీ రాజ్ కుమార్,ఈసీ సభ్యులు సాయినాథ్, లక్ష్మణ్, దత్తాద్రి,అర్బన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి, సృజన్,జిల్లా క్లాస్ ఫోర్ సంఘం కార్యదర్శి మక్బూల్ మరియు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.


# జిల్లావ్యాప్తంగా 'అరైవ్ అలైవ్' అవగాహన కార్యక్రమాల ప్రారంభం

## - ఉగ్రవాయిలో మొదటి సదస్సు పాల్గొన్న జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర
















**కామారెడ్డి, జనవరి 13(డిడి9 వార్త) :** రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీ ఆధ్వర్యంలో చేపట్టిన అరైవ్ అలైవ్ అవగాహన కార్యక్రమాలు కామారెడ్డి జిల్లావ్యాప్తంగా మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 13 నుండి 24 వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక కార్యక్రమాల ప్రారంభ సదస్సు దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉగ్రవాయి గ్రామంలో జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఉగ్రవాయి గ్రామం గత 11 నెలలుగా ఒక్క రోడ్డు ప్రమాద మరణం లేకుండా ఆదర్శంగా నిలిచిన నేపథ్యంలోనే ఈ కార్యక్రమానికి ఉగ్రవాయిని ప్రారంభ కేంద్రంగా ఎంపిక చేసినట్లు ఎస్పీ తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ,అరైవ్ అలైవ్ అనేది కేవలం ఒక నినాదం కాదౌ ఇది ప్రతి కుటుంబం సురక్షితంగా జీవించేందుకు తీసుకున్న ఒక ఉద్యమం. ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఇంటికి చేరాలన్నదే ఈ కార్యక్రమ లక్ష్యం అని అన్నారు.రోడ్డు ప్రమాదాలు యాదృచ్ఛికాలు కావని, అవి అతివేగం, నిర్లక్ష్యం, మద్యం సేవించి వాహనాలు నడపడం, మొబైల్ ఫోన్ వినియోగం, రాంగ్ రూట్ డ్రైవింగ్ వంటి తప్పిదాల వల్లే జరుగుతున్నాయని తెలిపారు. హెల్మెట్ ధరించడం చట్టం కోసం కాకుండా ప్రాణ రక్షణ కోసం తప్పనిసరిగా పాటించాలన్నారు.మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ఎన్నో కుటుంబాలు పెద్దదిక్కును కోల్పోతున్నాయని, ఆటో డ్రైవర్లు ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చే బాధ్యతను గుర్తుంచుకోవాలని సూచించారు. "సేఫ్టీ ఫస్ట్ ఇంటివద్ద మీ కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారు" అని గుర్తు చేశారు.ఈ అవగాహన కార్యక్రమాలు కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్ల పరిధిలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ సభలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. జనవరి 24 వరకు కొనసాగుతాయని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలందరూ పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ కోరారు.ఈ కార్యక్రమంలో ఏఎస్పీ బి. చైతన్య రెడ్డి ఐపీఎస్, రూరల్ ఇన్స్పెక్టర్ రామన్, దేవునిపల్లి ఎస్ఐ రంజిత్ గౌడ్, ఉగ్రవాయి సర్పంచ్ మహేష్, ఉపసర్పంచ్, యువకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.